# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ అహ్మదాబాద్ నుండి లండన్‌కు బయలుదేరిన ఏఐ-171 విమానం ఈరోజు ఘోర ప్రమాదానికి గురైంది.
- ❖ తల్లివందనం పథకాన్ని సుమారు 67 లక్షల మంది విద్యార్థులకు వర్తింపజేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- ❖ ప్రస్తుతం వస్తున్న కరోనా కేసులపై ఎలాంటి భయం అవసరం లేదని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా పరిశోధనలు చేపట్టాలని మంత్రి కె. అచ్చెంనాయుడు శాస్త్రవేత్తలకు సూచించారు.

====================

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఈరోజు మధ్యాహ్నం లండన్‌కు బయలుదేరిన ఏఐ-171 విమానం ఘోర ప్రమాదానికి గురైయింది. ప్రమాదం జరిగిన సమయంలో సిబ్బందితో సహా విమానంలో 242 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు తెలిపారు. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే మేఘాని నగర్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుల సంఖ్య అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

ఈ ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటన హృదయ విదారక విషాదం అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని నరేంద్ర మోదీ తెలిపారు.

====================

అభివృద్ధి, సంక్షేమం ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కూటమి పాలనకు సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఉండవల్లిలోని ఆయన నివాసంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ముఖ్యమంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌కు తల్లికి వందనం పథకానికి సంబంధించిన ఉత్తర్వులను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. దీని కోసం 10,091 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామన్నారు. సుమారు 67 లక్ష మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' వర్తింపజేస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ..

(వాయిస్ 36 సెకన్లు)

====================

ప్రస్తుతం వస్తున్న కరోనా కేసులపై ఎలాంటి భయం అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. వికసిత్ భారత్ అమృతకాలం, దేశంలో 11 సంవత్సరాల అభివృద్ధిపై గుంటూరులో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేసాయన్నారు. కరోనాపై వస్తున్న అపోహలు నమ్మవద్దని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో 11 సంవత్సరాల ప్రజా రంజక పాలన అమృత కాలంగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. నాణ్యమైన వైద్యం కోసం ఆయుష్, మహిళలకు ఉజ్వల యోజన పథకం, వ్యవసాయానికి అధిక ప్రధాన్యతనిస్తూ.. లక్షల కోట్ల నిధిని ఏర్పాటు చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకే దక్కుతుందని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 38 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు కొద్ది సేపటి క్రితం విడుదలయ్యాయి. మే 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను ఈరోజు అధికారులు విడుదల చేశారు. మొత్తం లక్షా 23 వేల 477 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 76.14 శాతం ఉత్తీర్ణత నమోదైయిందని అధికారులు ప్రకటించారు.

విరామం

====================

ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే దిశగా పరిశోధనలు సాగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు అన్నారు. గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవంలో ఈరోజు మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆహార భద్రతకై విశ్వవిద్యాలయం ఎనలేని కృషి చేస్తోందన్నారు. ఎగుమతులకు అనుకూలమైన రకాలను, సాంకేతికతను రూపోందంచాలని మంత్రి శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 24 మంది రైతులకు ఉత్తమ రైతు పురస్కారాలు, 16 మంది శాస్త్రవేత్తలకు ప్రోత్సాహక అవార్డులను ఆయన ప్రదానం చేశారు.

====================

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోని 29 రైల్వే స్టేషన్లలో ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషైన్స్ (ATVM)ల వద్ద అన్ రిజర్వ్‌డ్ టికెట్ విక్రయదారులుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేసేందుకు ధరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. 2027 మార్చ్ 31వ తేదీ వరకు ఈ ఒప్పందం చెల్లుబాటు కానుందని దీని కోసం పదవీ విరమణ చేసిన రైల్వే ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు దరఖాస్తు చేసుకోవచ్చని, అదే విధంగా 18 సంవత్సరాలు వయస్సు పైబడి కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులైన సాధారణ పౌరులు కూడా అర్హులేనని తెలిపింది. అయితే పదవీ విరమణ చేసిన రైల్వే ఉద్యోగులకు తొలి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసింది. ఆసక్తి కలిగిన

వారు ఈ నెల 19వ తేదీ లోగా విజయవాడ డివిజన్ డీఆర్ఎం కార్యాలయానికి ధరఖాస్తులను పంపించాలని మరిన్ని వివరాలకు digitalscr.in వెబ్ సైట్ ను సందర్శించాలని ఆ ప్రకటనలో పేర్కొంది.

====================

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 3 కోట్ల 75 లక్షల రూపాయలతో ఘన వ్యర్ధాల నిర్వహణ ప్లాంట్ ను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉందని, దశలవారీగా చెత్త నుండి సంపదను సృష్టించే క్రమంలో ఈ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో అందమైన పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 31 సెకన్లు)

====================

ప్రతీ రోజు యోగాసనాలు చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి అవకాశం ఉంటుందని శ్రీకాకుళం జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి జి. సూర్య ప్రకాష్ తెలిపారు. ఈరోజు శ్రీ కాకుళంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ… యోగా పట్ల అవగాహన పెంచుకొని యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చని అన్నారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 11 సంవత్సరాల పరిపాలన భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ అన్నారు. ఈ రోజు అనకాపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ… ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బాధ్యత యుతమైన, జవాబుదారిపాలన అందిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా కారణంగా ఎగుమతుల్లో భారత్ ఇప్పుడు ముందు వరసలో ఉందన్నారు. అలాగే దేశం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో ఉందని ఆయన పేర్కొన్నారు.

====================

ఈశాన్య రాజస్థాన్ నుండి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రాగల 24 గంటలలో అనేక చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర పేర్కొంది.
డెస్క్

====================
====================